ఉమను చూశాడు. మెరుపును చూసినట్లు శంకర్ కళ్ళు జిగేల్‌మన్నాయి. గుండె దడదడలాడింది. ఆమె అందానికి పరవశించిపోతూ ఆమెవెంట నడిచాడు.

ఉమ వెనకాలే శంకర్ ఆ యింట ప్రవేశించాడు.

అది రెండుగదుల ఇల్లు. పొగమాసిన గోడలు విరిగిపోయిన కుర్చీ బల్ల ఆ యింటి పేదతనాన్ని చాటుతున్నాయి. సంపాదనకు మించిన కుటుంబ సభ్యులు ఇంటి నిండుగా వున్నారు. అపురూప సౌందర్యవతి శాపవశాన ఆ ఇంట పుట్టింది. ఆ పేదరికంనుంచి ఆమెను విముక్తిచేయాలన్న తపన కలిగింది.

మాసిపోయిన పాతకాలం కుర్చీలో పడుకున్న ఆ ఇంటి యజమానితో ఏమీ సంకోచము లేకుండా 'ఉమను నేను చేసుకుంటాను' అని చెప్పాడు. తన చదువు, చేస్తున్న వ్యాపారం, తండ్రి గురించి అన్నీ చెప్పాడు.

ఉమ నాన్న ఆలోచించను భయపడ్డాడు. ఏమి కానున్నదో అది కాక మానదు మొదటిసారిగ వచ్చిన అవకాశాన్ని వదలదలుచుకోలేదు. కూతురి పెళ్ళి ఎలా చేయాలా? అన్న బాధకుతోడు అందమైన కూతుర్ని ఎలా కాపాడుకోవాలో తెలిసేదికాదు. వెకిలివాళ్ళు, రౌడీలు ఇంటి ముందు తిరిగేవారు. అది మరీ బాధగా పరిణమించింది.

శంకర్ అడిగిందే చాలన్నట్లుగా గుట్టుగ గుళ్ళో పెళ్ళిచేసి ఉమను అతనితో పంపించి తేలిగ్గా నిట్టూర్చాడు ఉమ నాన్నగారు.

# సమాప్తం

మనం కోరుకొనే మంచి సమాజం
కోసం
ఛాందసభావాలు వదిలి మార్పును
ఆహ్వానించాలి
పరిష్కారంకాని సమస్యకు పూర్తి
పరిష్కారం లభించేవరకూ
మళ్ళీ మళ్ళీ ఆ సమస్యలు గుర్తు
చేసుకొంటూనే ఉండాలి
ఆ సమస్యా పరిష్కారానికి ప్రయత్నం
జరుపుతూనే ఉండాలి

చిట్టారెడ్డి
సూర్యకుమారి

పరువు-ప్రతిష్టలను పట్టుకు వ్రేలాడే తలితండ్రులకు పెద్దకొడుకు శంకర్.తాను అనుకున్నది చేసి చూపించేవాడు. అలాగే తనకు నచ్చిన అమ్మాయిని చేసుకోటానికి వెనుకాడలేదు. ధైర్యంగా భార్యను వెంటబెట్టుకుని నేరుగ ఇంటికివచ్చి 'ఉమ'ను తల్లికి తండ్రికి పరిచయం చేశాడు.

వ్యాపారానికి వెళ్ళిన కొడుకు. అమ్మా! పెళ్ళిచేసుకొని వచ్చాను. ఇదిగో నాభార్య. అని చెపుతుంటే ఆశ్చర్యంగ నోళ్ళు వెళ్ళబెట్టి చూస్తూండిపోయారు.

తల్లితండ్రులకునమస్కారం చేయించి భార్య భుజంపై చెయ్యివేసి అతని గది లోకి నడిపించుకుపోయి, తలుపులు మూసుకున్నాడు.

వారు ఇక చేయగలిగింది ఏమీలేదని తెలుసుకున్నారు. వారి తాహతుకు తగినట్టుగా పార్టీయిచ్చి, బంధు మిత్రులకు కోడలును చూపించారు. ఉమ తన అందంతో అందరినీ ఆకట్టుకొంది. గర్వంగా తన స్నేహితులకు పరిచయం చేశాడు శంకర్. వారందరికంటే తాను పై ఎత్తులో వున్నట్లు అతనికి భావన కలిగింది.

* * *

ఉమలో. లేమిలోవున్న కరకుదనం మొరటుదనం కలిమిలో కరగిపోయాయి. కడిగిన ముత్యంలా, సానబట్టిన వజ్రంలా మెరవసాగింది. చక్కగా అలంకరించుకోవటం,వెళ్ళేచోటునుబట్టి కేశాలంకరణ, కాటుక, పెదాలకురంగు దిద్దుకోటం నేర్చుకొంది. అలా చక్కగా అలంకరించుకున్న భార్యను వెంటబెట్టుకొని క్లబ్‌కి డిన్నర్‌లకి వెళ్ళేవాడు. ఉమను చూసిన వాళ్ళు ఆమె చదివింది ఎనిమిదో తరగతి అని అనుకోరు.

అద్దంముందు కూర్చున్న ఉమకు తన ప్రతిబింబం అందులో కన్పించింది. కాని మనస్సుకి ఆనందంకలిగించలేకపోయింది. తన అందానికి మురుస్తూ వెంటబెట్టుకొని తిరిగే భర్తవున్నా తృప్తి కలుగలేదు. గొప్పింటి కోడలు తనకేమి లోటులేదు. మామగారు వ్యాపారపుగొడవలోవుంటారు అనుకున్నంతగ అత్తపోరులేదు. ఆడబిడ్డలు మాధవి. మాలతి, బి.ఎల్.బి.కాం. చదువుతున్నారు. ఎవరిపనులు వారు చేసుకుని పోతుంటారు. శంకర్‌కి ఓతమ్ముడు వున్నాడు. ఉదయ్. గుల్బర్గాలో మెడిసిన్ చదువుతున్నాడు. కోర్సు పూర్తిచేసుకొని వస్తాడు. వాడూ ఓపిల్లను వెంటబెట్టుకు రాకముందే పెళ్ళిచేయాలని ఆప్రయత్నాల్లో వున్నారు.

ఉమ ముఖానికి పౌడరు అద్దుకుంటూ 'తన అందమే తనకుఅదృష్టాన్ని తెచ్చింది. తనకి అన్నీ దొరికాయా' అని ప్రశ్నించుకుంది. శంకర్ తన అందాన్ని ఆరాధిస్తున్నాడు. ఇష్టంగ అతను సుఖిస్తున్నాడు. కాని తను తృప్తిపొందలేక పోతుంది. తనకు కావలసింది ఆరాధనకాదు అనురాగం. శంకర్ గొప్పవాడు. తన అంతస్తుకు హోదాకు తగిన భార్యను యెన్నుకున్నాడు. తన గొప్పతనానికి మెరుగు దిద్దుకున్నాడు. అతని అదృష్టానికి యితరులు ఈర్ష్య పడుతుంటే అతను సంతోషిస్తాడు.

భార్యాభర్తల సంబంధం కేవలం శారీరకమే కాదు. ఆత్మలకి సంబంధించింది.

తనకి ఆ భావన ఎన్నడూ కలగలేదు. అతని దృష్టిలో తనొక అపురూపవస్తువు. భర్తనించి తనకింకేదో కావాలన్న తపన కలగసాగింది.

ఉమ అద్దంలోకి చూస్తూ 'ఓ మనిషీ నీకు తృప్తిలేదు. పుట్టింట్లో కడుపునిండి వంటినిండా బట్టవుంటే చాలనుకున్నావు. దానికోసం ప్రాకులాడావు. అనుకున్న దానికంటె ఎక్కువగానే దొరికాయి. ఇప్పుడు మరేదో కావాలంటుంది మనస్సు. మరేదో ఊహిస్తుంది.' అని అనుకుంటూ నవ్వుకుంది.

బుగ్గమీద సొట్టపడింది. 'ఈ అందం లేకుంటే తన భర్త తనను ప్రేమించడే! భార్య అని మక్కువగ చూపించుకోడే! దూరం చేస్తాడా! మక్కువగ దగ్గరకు తీసుకోడా! అసలు ఈ అందం శాశ్వతమా!' అని అనుకుంటే గుండె గుబ గుబ లాడింది. తన అందం తనకు సంతోషాన్ని కలిగించటంలేదు. తన అందం చూసుకొని గర్వించటానికి బదులు ఏదో తెలియని బెంగ కలుగుతూంది.

తల దువ్వుకోవాలని పించలేదు. కాని శంకర్ వూరెళ్ళి రెండ్రోజులయింది. సాయంకాలానికల్లా వచ్చేస్తానన్నారు.ఏదో ప్రోగ్రాం పెట్టుకొనే వస్తారు. తయ్యారు కావాలి. దువ్వెన అందుకొంది. హాల్లో ఫోన్ మ్రోగింది. ఆలోచనలో వున్న ఉమ ఆ శబ్దానికే వులిక్కిపడింది.

ఫోన్ ఎవ్వరూ ఎత్తలేదు. ఆగకుండా మోగుతూ నేవుంది. ఉమలేచి గదినుండి బయటకు వచ్చింది. ఎవ్వరో ఒకరు ఎత్తుతారులే అన్నట్లు ఎవ్వరికి వారు వూరు కుంటారు. అప్పుడే లోపలికి వచ్చిన మాలతి విసుగ్గా ఫోను ఎత్తింది. మాలతి చెయ్యి గుండెలమీదికి పోవటం—మెట్లు దిగుతున్న ఉమచూసి అక్కడే ఆగి పోయింది. భయంకరమైన వార్త వింటు న్నట్లు కళ్ళు పెద్దవిచేసి వింటున్న మాలతి మెట్లమీద నిల్చొన్న ఉమవైపు పిచ్చిగా చూసింది. 'అమ్మా' అంటూ గావుకేక పెట్టింది. "పెద్దన్నయ్య కారు ఏక్సిడెంట్ అయిందట ..."

తరువాత మాటలు ఉమచెవిలో దూర లేదు.

* * *

ఉమ ఇప్పుడు విధవ. పెళ్ళయి సంవత్సరమైనా పూర్తికాలేదు.

ఇప్పుడు తన అందానికి విలువలేదు అందం, సువాసనవున్న తోటలో పూవు కాదు. తను చూస్తుండగానే కాయితం పూవుగా మారిపోయింది. ఇలా అవుతుం దని ఎన్నడూ వూహించలేదు. శంకర్ ఆరాధించే ఈ అందం పోతుందేమో- అతనికి దూరం అవుతుందేమోనని భయ పడిందేకాని అతనే శాశ్వతంగ ఈలోకం నుంచి వెళ్ళిపోతాడని అనుకోలేదు. ఎంతలో తన బ్రతుక్కి విలువలేకుండ పోయిందీ! ఇదేనా జీవితం-అనుకుంటూ కుమిలిపోయింది.

అంత దుఃఖంవున్నా ఉమ కంటిలో కన్నీరు కనపడలేదు.

భర్త చనిపోతే ఏడ్వని భార్యను వింతగ చూశారు.

* * *

ఆ ఇంటికి పెద్దకోడలు, రాణిలా వెలిగిన ఉమ ఇప్పుడు వంట మనిషి. ఎంతకాలం ఒంటరిగ గదిలో కూర్చుం

టుంది! తనకై తానువచ్చి వంటగదిలో స్థానమేర్పరచుకుంది.

శంకర్ పోయిన రోజునవచ్చి తల్లి తండ్రి ఖర్మకాండలు ముగిశాక ఏడుస్తూ వెళ్ళిపోయారు. కూతుర్ని ఇంటికి తీసుకు పోలేదు. తనను పోషించి, భరించేశక్తి వారికిలేదని ఉమకి తెలుసు.

అత్తగారి ఏడుపులు సాధింపులు ఉమను ఏమి చేయలేకపోయాయి. మొండి వాడు అందరికంటే బలవంతుడు. విధి వ్రాసిన రాత ఇది తనకర్మ అనుకుంది. తనకూ ఓ మనస్సు అంటూ వుందని మరచి పోయేదే కాని . శంకర్‌లా వుండే ఉదయ్‌ను చూపి మరువలేకపోయింది.

మొదటిసారి ఉదయ్ స్వరం విని వులిక్కిపడింది. మెడమీది వెంట్రుకలు నిక్క పొడుచుకున్నాయి ఊరునుంచి వచ్చిన శంకర్ 'అమ్మా!' అని పిలిచి నట్లుగానే వుంది.

అతని నవ్వు బాధాకరమైన సంతోషాన్ని కలిగించేది. ఉదయ్ నవ్వుకొరకు కాచుకుని వుండేది. అతను నిలుచునే తీరు-నడక కళ్ళెత్తి చూసే విధం శంకర్‌ని గుర్తుకుతెస్తాయి.

శంకర్ దృఢంగ గంభీరంగ అబోతువంటి వాడైతే ఉదయ్ కోడెద్దు లాంటివాడు. అతన్ని చూడకూడదను కుంటూనే తలుపు సందుల్లోనుంచో, తెరచాటునుంచో చూస్తుంది అలా చూడడంలో ఏ దురుద్దేశం తనకు లేదని సరిపెట్టుకునేది.

ఉదయ్ ఎదుటకు ఎప్పుడూ పోలేదు. తనను అతడు చూశాడో లేదో కూడ తెలియదు

కొండంత పెద్దకొడుకు పోయాక, చిన్నకొడుకుని వదలి వుండలేకపోయింది తల్లి. ఆ వూళ్ళోనే ప్రాక్టీసు పెట్టు కున్నాడు. మరోవైపు నాన్నకి వ్యాపారంలో సాయం చేస్తూనే వున్నాడు.

శంకర్ లేకపోవటంతో ఆ ఇంటికి కళ పోయినట్లుంది.

భర్త పిల్లలువున్న అత్తగారే అంతగ కృంగిపోయారు. తనకున్న ఒక్క ఆధారం శంకర్ పోతే తనెలావుంటుందో? తన బాధ ఏమిటో? తన భవిష్యత్తు ఏమిటోనని ఒక్కరూ ఆ ఇంట్లో ఆలోచించేవారులేరు. ఇంతేనా జీవితం! తన భవిష్యత్తు శూన్యమేనా? ఇరవై సంవత్సరాలకే తన్ బతుకు సమాప్తమైపోయిందా! కలవరపడుతూ ఉమ ఆలోచిస్తూ పశ్చిమాకాశాన్న ఇంకిపోతున్న సూర్యుని చూస్తూ పెరడు బావిదగ్గర నిలుచుంది. ఏ ఆశలేని తన హృదయం రోజు రోజుకు అలాగే కృంగిపోతుందని తలచింది.

ఇంటిలో ఎవ్వరూలేరు. మాధవి, మాలతి కాలేజీనుంచి ఆలశ్యంగా వస్తామని ఫోన్‌చేశారు. అత్తమామగార్లు ఆ వూరిలోనే ఏదో సంబంధం వుందని మాధవి కొరకు చూడ్డానికి వెళ్లారు.

ఉదయ్ ఊరిలో లేనట్లుంది, రెండ్రోజులుగా కనపడలేదు.

ఉమ తలస్నానం చేసింది. తలారపెట్టుకుంటూ పెరడులోకి వచ్చింది. తనెప్పుడు ధైర్యంచేసి ముందు వరండాలోకి పోలేదు. తనస్వరం వంటగది దాటిపోదు. ఒంటరితనం బాధగవుంది. ఎక్కడికైనా వెళ్తాం అనుకుంటుంది. ధైర్యంచేసి అడుగు బయటపెట్టలేదు

అత్తగారు వూరుకుంటుందా! తన నీడ ఆమెమీద పడినా సహించదు. అందుకే ఇలా ఎవ్వరూ లేనప్పుడు పెరట్లోకివచ్చి గాలి పీల్చుకుంటుంది.

విశాలమైన ఆకాశంకేసి చూస్తూ నిలుచుంది.

మరో మనిషి దగ్గర్లో వున్నట్లనిపించింది. తిరిగి చూసింది తలుపుకివతల నిల్చున్న ఉదయ్ దీర్ఘంగా చూస్తున్నాడు.

ఉమ తిరిగి చూడగానే దగ్గరగావచ్చి నిల్చున్నాడు. అంత దగ్గరగా ఉదయ్‌ని స్పష్టంగా చూడడం మొదటిసారి. ఉమ గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"మీరూ ..?" అన్నాడు. ఓ అందమైన దృశ్యంచూసి ముగ్ధుడైనట్లున్నాయి అతని చూపులు.

అంటే! తనను ఇంతవరకు చూడలేదా ఉదయ్. శంకర్ భార్యను చూద్దాం అన్న కుతూహలం కూడ కలుగలేదా! అనుకుంటూ

ఉమను మీ వదినను కన్నులు క్రిందికి వాలుస్తూ అంది.

"మైగాడ్ ...మీరు...." చకితుడై ఉమను చూస్తూ. "మీరు వదినగారా!" ఇంత చిన్నగావున్న ఈమె విధవ!! మాలతి వయస్సు వుంటుందా! అనుకున్నాడు.

ఇంతవరకూ శంకర్ భార్యను చూద్దాం, పలుకరిద్దాం అని అనుకోలేదు.

విధవ అయిన అన్న భార్యను చూసే ధైర్యం లేకపోయింది.

ఆమె చాటుగా తప్పుకుంటున్నప్పుడు చీర కుచ్చెళ్లో పైట చెంగో అతని కంట పడేది. జాలిపడేవాడు. అంతకంటే తనేమి చేయగలడు! పుట్టింటికి వెళ్ళిపోక ఇక్కడే వున్నందుకు సంతోషించాడు. అన్నలేక


సంక్రాంతి శుభాకాంక్షలతో

ఫోన్ 76824



ఆధునిక జీవనానికి
చిరకాల మన్నికకు
అలంకార్ స్టీల్ ఫర్నిచర్
సోఫా కం బెడ్స్ వాడండి

తయారు చేయువారు
అలంకార్ స్టీల్ ప్రొడక్ట్స్
ఏలూరు రోడ్డు.....విజయవాడ 2

Alankar

పోయినా, అన్నకు ఆత్మీయురాలు ఇంట్లోనే వుంది అని తృప్తిపడ్డాడు.

చిన్నగ గూడు వదలిన పక్షిలా నిస్స హాయతగ ఒంటరిగావుంది. జాలితో అతని మనస్సు నిండిపోయింది. అంద మైన ఆస్త్రీని చేతుల్లోకి తీసుకుని ఆమె దిగులును పోగొట్టాలనిపించింది.

"ఉమా!" అన్నాడు అప్రయత్నంగ.

ఎప్పటినుంచో ఆ పిలుపుకోసం వేచి వున్నదానిలా ఆశగా కనులెత్తి చూసింది. ఆ కన్నుల నిండుగ కన్నీరు వుబికి నందున ఉదయ్‌ను స్పష్టంగా చూడలేక పోయింది.

*　　　*　　　*

మనిషి ఏకాకికాడు. తోడు కోరుకుం టాడు. స్నేహాన్ని ఇష్టపడతాడు. వాటి కోసం ఏ సాహసమైనా చేస్తాడు.

తను ఎక్కడవున్నా ఏంచేస్తున్నా ఓ జత కళ్ళు తనను చూస్తుంటాయని ఉదయ్ గమనించాడు.

బయటికిపోతూ కంటికి ఎవ్వరూ కన పడకపోయినా వెళ్ళి వస్తానన్నట్లుగా చెయ్యి గాలిలో వూపుతాడు. ఉమ కిటికీ తెర కదులుతుంది.

ఉమ కిప్పుడు జీవితం మరీ నిస్సా రంగలేదు. 'తనకోమనిషి సానుభూతి వుంది.' అన్నతలంపు ఓవిధమైన బలం కలుగజేసింది.

తనకోసమే అన్నట్లుగా భోజనం దగ్గర మరి కాస్సేపు గడిపేవాడు. 'ఉమ గారూ? కాఫీ' అని నేరుగ పిలిచి అడుగు తున్నాడు.

ఆమె చేసినవంట బ్రహ్మాండం అని పొగుడుతూ, ఉమకు సంతోషాన్ని కలుగ చేసేవాడు. ఉమ చూసినప్పుడు తియ్యగా నవ్వుతాడు.

ఏ విధవను చూసిన, ఏ దీనురాలిని చూసినా ఉదయ్‌కు ఉమ గుర్తుకువస్తుంది. భర్త పిల్లలతో నూరేళ్ళు బ్రతకవలసిన ఉమ జీవితం అప్పుడే సమాప్తమైందా! ఇక జీవించినంతకాలం వంటగదికి అంకి తమై పోవలసిందేనా! ఆమె యవ్వని. మనస్సుంది. కోరికలు వుంటాయి. వాటిని బలవంతంగ చంపుకోవలసిందేనా అని పదే-పదే ఆలోచించేవాడు.

తనేం! చెయ్యాలి??

ఒకరోజు భోజనంచేస్తూ 'ఉమగారూ! ఎప్పుడూ వంటచేస్తూ గడిపేకంటే, చదువుకోకూడదూ! ఎంతవరకు చది వారూ!...." అయితే మెట్రిక్కు కట్టండి! పుస్తకాలు తెస్తాను. మాధవితో చెప్పించు కోండి" అని అన్నాడు.


అతను అనరాని మాటలు అన్నట్టుగా చూసింది అమ్మగారు.

"ఆఁ చదువు. దేనికి పనికివస్తుంది! ఉద్యోగం చేయాలా, వూర్లు ఏలాలా! వంటింటి విషయాలు మగవాడికి నీ కెందుకు...!" చీవాట్లు వేసింది.

పెద్దవాడు శంకర్‌ని తిట్టే ధైర్యం వున్నా, అతడు ఏంచేసినా అడ్డుచెప్పలేక పోయేది. మొండిపట్టుతో అన్నీ సాగిం చుకునేవాడు.

ఉదయ్ మెత్తటి మనస్సు కలవాడు. ఒకరిని నొప్పించే స్వభావంలేదు. అమ్మ కొట్టినా ఎదురుతిరిగేవాడు కాదు. అందుకే ఆ తల్లికి అతనంటే అంతులేని అను రాగం.

ఆమె కూతుళ్ళు మాధవి, మాలతి




చదువుకోటల్లేదూ!

ఉద్యోగంచేసే అవసరం వారికిలేదని చదువు మానేశారా?

రేపు పెళ్ళిచేసుకుంటే ఆ చదువు పిల్లల్ని కంటుందా! అక్షరజ్ఞానం లేని వెంకమ్మపుల్లమ్మలూకంటున్నారుపిల్లల్ని. వారికంటే భర్తలేని ఉమకు చదువు అవసరమని అమ్మ గ్రహించదేమి? అని తనలో తర్కించుకున్నాడేగాని యెదురు తిరిగి ఆమాటలు తల్లితో అనలేకపోయాడు పెద్దది నొచ్చుకుంటుందని అనుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. మాధవి, మాలతి పెళ్ళిళ్ళు జరిగాయి. ఉదయ్, ఉమలమధ్య ఆత్మీయతలో చనువు వృద్ధి అయింది. ఉదయ్‌కి ఏంకావాలో అన్నీ అమర్చేది. పనిమనిషి చేయటానికి వెనుకాడే పనులుకూడా చేస్తుంది. పనిమనిషికి డబ్బులిచ్చి ఋణం తీర్చుకోవచ్చు. ఉమకు తను ఏంచేయగలడు. ఏంచేస్తే ఉమజీవితం చక్కబడుతుంది. ఉమ చూపులు తనను వెంటాడుతూ హాంట్ చేస్తుంటాయి.

మాధవి పెళ్ళి సమయంలో ఉమ గదిలో ఓమూల కూర్చుండిపోయింది. ఏదో పనిమీద వచ్చిన ఉదయ్ గోడకు ఆనుకుని కూర్చున్న ఉమను చూశాడు. అతని హృదయం కరిగిపోయింది. 'ఉమా' అన్నాడు. తెల్లటి కళ్ళతో చూసింది. బయట మంగళ వాయిద్యాలు,వాళ్ళనవ్వులు పరిహాసాలు ఆ లోకంతో సంబంధం లేకుండా ఏకాకిగావుంది. ఎన్నడూ కలుగని ఆలోచన ఆరోజున ఉదయ్‌కి కలిగింది.

'ఉమా! నీకు నేనున్నాను!' అంటూ ఆమెను హృదయానికి 'చేర్చుకోవాలనిపించింది. అప్పటికప్పుడే హృదయానికి

చేర్చుకోలేకపోయినా ఆ భావాన్నికన్నుల్లో కురిపించాడు. ఆ చూపులు ముందు భయం గొలిపినా హాయిగాఅనిపించాయి. సన్నగా నవ్వింది ఉమ. సన్నాయి తారస్థాయి నందుకొంది.

పెళ్ళిలో ప్రతినిమిషం పెద్దకొడుకుని తలచుకొని అమ్మ కంటనీరు పెడుతూనే వుంది.

చచ్చిపోయిన వారికోసం యేడుస్తారు కాని, చావలేక బ్రతికివున్న వారికోసం ఏమీ చేయటానికి ప్రయత్నించరేం.. .!

మాధవి, మాలతులు అత్తవారింటికి వెళ్ళిపోయారు. ఇంట్లో సందడిలేదు. పెద్దకొడుకు వెళ్ళినరోజునే ఇంటి కళ తప్పింది.

ఇప్పుడు మౌనంగా. బోసిగవుంది. శంకర్ వుంటే ఈపాటికి పసిపిల్లలతో ఇల్లు కళగా నిండుగా వుండేది. అమ్మ కన్నీరు తుడుచుకుంది. ఉదయ్‌కి వెంటనే పెళ్ళిచేసి కోడలిని తెచ్చుకోవాలి.

ఇంట్లో పసివారు నడయాడితేగాని మనస్సు పూరుకోనంది

ఉదయ్‌తో పెళ్ళిప్రస్తావన తెచ్చి అమ్మాయిల వివరాలు చెప్పసాగింది.

అన్ని సంభాషణలు సాధారణంగ భోజనాల దగ్గరే వస్తుంటాయి,

ఉదయ్ నిదానంగా అమ్మను చూస్తూ నెమ్మదిగా "అమ్మా! ఉమను పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు.


"ఏ ఉమరా!"

ఉమవైపు తలూపాడు. కూరగిన్నెలు పట్టుకువస్తున్న ఉమ అక్కడే ఆగి పోయింది. నోట మాటరానట్లు వుండి పోయినా మరుక్షణం భద్రకాళిలా నిప్పులు కురిపించింది తల్లి. "సిగ్గులేదట్రా! అన్న భార్యను చేసుకుంటాననటానికి! నీకు నోరు ఎట్లా వచ్చింది! అన్నమీద నీకు గౌరవంవుంటే నీకు ఈ ఆలోచన వస్తుందా!" నోటికి వచ్చినట్లు తిట్ట సాగింది.

ఉమ అక్కడనుంచి పరుగెత్తిపోయి తనగదిలో గజ గజ వణుకుతూ పడు కుంది.

"అమ్మా చచ్చిపోయిన వాళ్ళగురించి ఆలోచిస్తూ తపనపడుతున్నావు—బ్రతికి కంటి కెదురుగావున్న వాళ్ళగురించి ఆలో చించరేం! నేను చచ్చిపోయి నా భార్య అలావుంటే నేను వూరుకోలేను నా ఆత్మ శాంతిగా వుండదు అని తెలుసు"

"ఉదయ్!" అంటూ పిచ్చిగా అరచి, బల్లమీద పడిపోయింది. తన ముద్దుల కొడుకు అంతగా దిగజారిపోతాడనుకో లేదు. మరో పిల్లను పెళ్ళాడి పిల్ల పాపలతో నూరేళ్ళు బతుకుతాడనుకొంది. ఇంతగా మలిన పడతాడనుకోలేదు. తమ పరువు ప్రతిష్టలు ఏంకావాలి! తన ఆడ పిల్లలకి వారి అత్తగారింట్లో ఎలాటి గౌరవం లభిస్తుంది! వదినను చేసుకుం టాడా! అని అందరూ వూయరూ! అవే శంతో ఆమె హృదయం భగ్గుమంది. మంచంలో పడుకున్నదల్లా లేచి పండ్లు కోసుకునే కత్తి అందుకొని పరుగెత్తి ఉమ గదిలో జొరబడింది. ఉమ కెవ్వుమంటూ కళ్ళు మూసుకుంది. ఉమ జుట్టు జవిరి పట్టుకుని "ముండ. నా పెద్దకొడుకుని మింగేశావు. చిన్నవాడ్ని కూడ నీ అందంతో చంపేస్తావా!"




అంటూ సర్రుమని జుట్టు కోసేసింది. "వాడు మరోసారి నీ పేరు ఎత్తాడా, ఈ కత్తి నీ గుండెల్లో గుచ్చుకుంటుంది." చేతుల్లో నిండుగావున్న బారెడు జడను విసిరికొట్టింది. అప్పటికి ఆమె కక్ష తీరినట్లు వెళ్ళిపోయింది.

అమ్మ తిట్టుతూ పడిపోగానే, విసురుగ ఇంటినుంచి వచ్చేశాడు ఉదయ్.

మనశ్శాంతి కోసం అక్కడా ఇక్కడా తిరిగి-క్లినిక్‌లో వుండి రాత్రి పదిన తర్వాత ఇంటిదారి పట్టాడు.

ఇల్లంతా అతి నిశ్శబ్దంగావుంది. నాన్న గారు ఇంట్లోలేరు. లేకుంటే మరింత రభస జరిగేది అనుకుంటూ డైనింగ్ హాలుకి వచ్చాడు బల్లమీద భోజనం లేదు వంటచేసిన సూచనలు లేవు

అక్కడే కునికిపాట్లు పడుతున్న పని మనిషి పాలుతెచ్చి ఇచ్చింది అవి త్రాగి తన గదివైపు పోతున్నాడు కాలికి మెత్తగా తగిలినదానిని చేతులోకి తీసుకున్నాడు. అది జడ-విడివడివుంది. పని మనిషివైపు కళ్లు విప్పారించి చూశాడు. ఆమె సైగచేస్తూ జరిగింది చెప్పింది. అతని గుండెల్లో రక్తం వేడెక్కింది. ఆ వెంట్రుకలను పట్టుకొని ఉమ గది లోకి వెళ్ళాడు.

ఆ గది చీకటిగావుంది. తడుముకుంటూ ముందుకి వెళ్ళాడు.

గువ్వలా ముడుచుకుని పడుకున్న ఉమను తాకాడు.

ఆవేదనతో ఆమెను పొదవి చేతుల్లోకి తీసుకున్నాడు.

తల నిమిరాడు. ఉమకు జరిగిన అవమానానికి అతని గుండె నీరు కారిపోయింది ఈ సంఘంమీద అమ్మానాన్నలమీద కక్ష తనచేతగానితనానికి తన మీద తనకే అసహ్యం కలిగాయి

ప్రేమగా ఉమను గుండెలకు హత్తుకున్నాడు తను ఆమెకు ఏమి ఇవ్వగలడు। ఏమిస్తే ఆమె దుఃఖంపోతుంది

అతను ఇవ్వగలిగింది చేయగలిగింది ఒక్కటే తన ప్రేమ-తన శరీరం!

ఉదయ్ ప్రేమ ఉమ ఆత్మను తాకింది ఎన్నడూ పొందనంత సుఖం తృప్తి ఆ రాత్రి తను పొందినది.

ఉదయ్ కొరకు తన శిరోజాలేకాదు ప్రాణాలను కూడ సులభంగా ఇవ్వ గలదు.

ఉదయ్ ఆ రోజునుంచి అమ్మముందు ఉమ పేరు ఎత్తలేదు.

చాటుగా మాటుగా వారు ఆనందాన్ని వెతుక్కుంటూనే వున్నారు.

ఒకరోజు ప్రక్కింటి తులశమ్మ ఇంట్లో ఏడుపులు. వినిపించాయి. తన విధవ కూతురు కులంకానివాడితో లేచి పోయి పెళ్ళి చేసుకుందని. కూతుర్ని వాడిని వారం రోజులు తిడుతూ శపిస్తూనే వుంది.

ఉమతో ఉదయ్ ఎక్కడ లేచిపోతాడో నని అమ్మకు భయం పట్టుకుంది.

ఉమను ఇంట్లోనుంచి వెళ్ళగొట్టే ప్రయత్నంలో వుండగా! 'పిచ్చిదానా, మధువు. మగువ మరిగిన మగవాడు దేని కైనా తెగిస్తాడు. ఎంతటి నీచానికైనా దిగజారిపోతాడు. దాన్ని తరిమేస్తే బయట బాహాటంగా కాపురం పెట్టేస్తాడు. కనుక దాన్ని ఇంట్లోనేవుంచి, నీ కొడుక్కి పెళ్ళిచేయి' అని భర్త సలహా ఇచ్చాడు.

"ఉమా! అమ్మ పెళ్ళిచేసే ప్రయత్నంలో వుంది. ఒకరికి న్యాయం చేయ బోయి మరొకరికి అన్యాయం చేస్తానేమో! మనం ఎక్కడికైనా వెళ్ళి పోదాం! పెళ్ళిచేసుకుందాం! నేను డాక్టర్ని. నిన్ను పోషించలేకపోను...." అని అన్నాడు

ఇంతకంటె ఎక్కువ ఆశించటం దురాశ అవుతుందని ఉమ అనుకొంది

'సంఘం మారలేదు. ఏ కాస్త మారినా మన ఆచారాలు మాసిపోలేదు. మనవాళ్ళ భావాలు మనస్సులు బూజు పట్టివున్నాయి. నాలాటి అభాగ్యుల గతి ఇంతే. వెళ్ళి పోయి ఇందరిని బాధపెట్టి మనం సుఖ పడలేం' అని ఉమ ఉదయ్‌తో అంది.

అమ్మ అంటే ఉదయ్‌కి ఎంత ప్రేమ వుందో ఉమకు తెలుసు. ఆమె ప్రాణా లైన వదులుతుందిగాని వారిపెళ్ళికి ఆమో దించదు. అందుకే అలా చెప్పింది.

ఉదయ్ పరిస్థితులకు బానిస కాక తప్ప లేదు. అమ్మతెచ్చిన అమ్మాయి రాజ్య లక్ష్మిని పెళ్ళి చేసుకున్నాడు.

ఉదయ్‌కి పెళ్ళి అవుతుంటే బాధతో తన హృదయం పగిలిపోతుందని అను కొంది. కాని ఉదయ్‌కి మంచి భవిష్యత్తు వుండాలంటే అతను పెళ్ళిచేసుకోవాలి. సుఖంగా పాపలతో కలకాలం జీవించా లనుకొంది. అతనిమీద ప్రేమ అలా ఆలోచింప చేసింది.

అతన్ని చూడగలదు. అతనికి సేవ చేయగలదు. బ్రతికివుండటానికి ఓకారణం వుంది. అది చాలు అనుకుంది ఉమ.

* * *

ఉదయ్ ఉమను మరువలేదు. ఆమె సాంగత్యాన్ని వీడలేదు. భార్యను తృప్తి పరచి ఉమ దగ్గరకు వచ్చేవాడు.

అది 'తప్పు' అని ఇద్దరికీ తెలుసు. పరిస్థితులకు బానిసలైపోయారు. ఉమ బాధ పడుతుంటే అతను 'ఉమా! తప్పు అను కుంటే అంతా తప్పుగానే కనిపిస్తుంది.

మన పుట్టుకే పాపంతో మొదలయింది. నిన్నిలా మోడుగా బ్రతకమని శాపిం చటం తప్పుకదూ! నీతిగా బ్రతికేదారి వున్నా తప్పుడుదోవను వారే చూపించారు మన సంబంధం ఇంట్లో అందరికీతెలుసు. తెలియనట్లు నటిస్తున్నారు.

నీతిగా బ్రతుకుతామంటే ఒప్పుకునే గుండె ధైర్యం లేదువారికి. అమ్మకినాన్న అవసరం ఇంకా వున్నప్పుడు, కూతురు లాంటి నీకు వారిలా కోరికలు వుంటా యని ఎందుకు ఆలోచించదు?....' అలా తాము చేస్తున్న తప్పును సమర్థించేవాడు.

* * *

లైన్స్‌క్లబ్ మెంబర్లు ఒకనెలరోజులు విదేశ పర్యటన చేద్దాం అని తీర్మానించు కున్నారు.

ఆయాదేశాల్లోవున్న లైన్స్ మెంబ ర్సుతో సంప్రదింపులు జరిపారు. పదివేల రూపాయలతో కొన్ని దేశాలయినా చూడ వచ్చు. ఈ తరుణం మరలా రాదను కొన్నారు.

ఉదయ్, ఉదయ్ నాన్నగారు ఫారిన్ యాత్రకు బయలుదేరారు.

ఆయా దేశాలను సందర్శించి వస్తూ వస్తూ తీసుకురాగలిగిన వస్తువులు పట్టుకు వచ్చారు.

ఉదయ్ తనకు ఇద్దరు భార్యలు అను కొంటూ రహస్యంగా తనలోతాను నవ్వు కున్నాడు. ఉమకు, రాజ్యలక్ష్మికి బహు మతులు కొంటున్నప్పుడు

రాజ్యలక్ష్మి, అమ్మ సంబరంగా స్వాగతం చెప్పారు. వారి బహుమతు లనుచూపి మురిసిపోతుండగా ఉదయ్ ఉమను చూద్దాం అన్న ఆతురతతో డైనింగ్ టేబుల్‌వద్దకు వచ్చి "ఉమ గారూ! మీ చేతికాఫీ కోసం అలమటించి పోయాను. స్ట్రాంగ్ కాఫీ...." అంటూ ఉత్సాహంగా పలుకరించాడు.

కొత్తగావచ్చిన వంటమనిషి కాఫీకప్పు బల్లమీద వుంచుతూ...."ఉమగారు ఆసు పత్రిలో వున్నారు" అని చెప్పింది.

"హాస్పిటల్ లోనా? ఎందుకు?" ఆ కంఠంలో ఆతురత వుంది.


WHEN NATURE FAILS

H New Super eight మరింత ఎత్తు, పొడుగు కాగలరు. 2 నుండి 8 అం వరకు పూచీ మీరు పొడుగు పెరగదలచు కుంటే ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మా హైటెక్స్ HYTEX ఔషధాన్ని వాడండి. వయో పరిమితిలేదు. స్త్రీలు పురుషులు కూడా పుచ్చుకోవచ్చు.

HYTEX is a great name and meant for popular people [Phail] (20 T. A. B. S.) Rs. 7-50 advance By M. O. 3 Phails (60 Tabs) Rs. 15/- money order by advance.

M/s. VICTORIA COMMERCIAL COY,
Beat No. 1,
Ambala Cantt – 133001. (N. I)
Correspond in English(JMM 1/78)

"ఉమగారికి టెటనస్ వచ్చిందండీ!" వెనుకగా వచ్చిన రాజ్యలక్ష్మి అంది.

"ఉమగారికి టెటనసా. మైగాడ్! టెటనసా?" నమ్మలేనట్లు అన్నాడు.

"ఎందుకు వచ్చిందీ? ఎలా వచ్చిందీ" పైకి లేస్తూ అన్నాడు

"చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవా! ఎవరి కర్మకు ఎవరు కర్తలు ..." హాలులోవున్న అమ్మ మాటలు స్పష్టంగా విన్నాడు.

పరుగులాంటి నడకతో బయటకువచ్చి "ఒక్కదాన్నే హాస్పిటల్లోవుంచారా! ఆమె దగ్గర ఎవ్వరున్నారు?" అన్నాడు.

"పక్కింటి తులశమ్మ అక్కడేవుంది." భుజంమీద వేసుకొన్న చీర సొగసులను చూస్తూ రాజ్యలక్ష్మి అంది.

* * *

చీకటిగదిలో మూల మంచంలో పడి వుంది ఉమ. ఆ జబ్బుతో వచ్చినఫిట్సులో కట్టెలా బిగుసుకుపోతున్న శరీరం, వంగిపోయిన వీపు, గొంతులో పిండే బాధ, మూతి వంకరపోయి, అష్టవంకరలు తిరిగిపోయిన ఉమను చూశాడు. ఇంజెక్షన్లు, మందులతో అదో విధమైన వాసననిండి వుంది ఆ గదిలో.

మత్తు మందుల్లో మత్తుగా పోయే ప్రాణంతో పెనుగులాడుతోంది ఉమ.

'ఉమ! ఉమా!' ఆవేదనగా పిలిచాడు. ఆమెను రెండుచేతులతో చుట్టివేస్తూ. ఆ స్వరం వేణునాదంలా ఆమెను తాకింది. కన్నులు విప్పింది.

ప్రేమ పూరిత నయనాలతో చూస్తున్న ఉదయ్ కనిపించాడు. ఇప్పుడు తను ఎంత అసహ్యంగా, వికారంగా వుంటుందో తనకు తెలుసు. అయినా ప్రేమగా పిలుస్తున్నాడు ఉదయ్.

తన అందాన్నికాదు అతను కోరుకుంది. హృదయమున్న మనిషిగా తనను చేరదీశాడు. అందుకే ఉదయ్‌ని దేవునికంటె ఎక్కువగా ప్రేమించింది. అతన్ని శాశ్వతంగా తనలో ఇముడ్చుకోవాలనుకున్నది. ఉదయ్ బిడ్డ తనలో పెరుగుతున్నాడంటే సంతోషించింది. మూడు నెలలు ఇష్టంగా అతని ప్రాణాలను దాచుకుంది. కాని తనకా సంతోషం శాశ్వతం కాదు. తను మోడు. చిగురించకూడదు. పాపం. తను లోకుల దృష్టిలో కులట. అందుకే తన గర్భాన్ని తీసేసుకుంది. పక్కింటి తులశమ్మ ఎవ్వతెనో తెచ్చింది అది ఎలా చేసిందో ఏమో మూడోరోజుకు జబ్బు చేసింది.

కాకిలా కలకాలం జీవించేకంటె ఈ అమృతమూర్తి చేతుల్లో తన జీవితం సమాప్తమైతే అంతేచాలు. అతని కోసం ప్రాణాలన్నీ కూడదీసుకొని వేచివుంది.

ఉదయ్ కన్నుల్లోకి చూస్తూప్రాణాలు వదిలింది ఉమ.

"ఉమా! నీవు చనిపోలేదు. నిన్ను హత్యచేశారు." అంటూ ఉదయ్ హృదయం ఏడుస్తూ మూలిగింది. □